

# ఆ జీవితం నాది

**యర్రంశెట్టి శాయి**

పెళ్ళికొడుకు వంగి మా శకుంతల మెడలో తాళికడుతున్నాడు. శకుంతల సిగ్గుపడుతూ మెడను, గుట్టప్పిల్లలా కదుపుతోంది. బాజాలు గుండెలదిరేట్లు మ్రోగుతున్నయి. పురోహితులు పెంకు లెగిరేట్లు మంత్రాలు చదువుతున్నారు. ఆకాశమంత పందిరి క్రింద ఆశీనులయిన అందరి దృష్టి ఆసమయంలో కల్యాణ మండపం మీదే వుంది. కాని నేను మాత్రం అసలు అటువేపు చూడటమే లేదు. ఆఖరి వరుస కుర్చీల్లో, చివర కూర్చుని నావంకే చూస్తున్న అతనినే

చూస్తున్నాను. అతను నావంకే ఎందుకలా చూస్తున్నాడో నాకు అర్థంకాలేదు. నేను పందిరి గుంజ కానుకొనినుంచున్న తీరు అతనికి నచ్చిందా: లేక నారూపం అతగాడికి నచ్చిందా ...మరి ఆ చూపు కర్థమేమిటి? ఏమో! ఏమయినా కానీ, నాకూ అతన్నే చూడాలనిపిస్తోంది. అతని దగ్గర అలా అనిపించటానికి కావలసినంత ఆకర్షణవుంది. అంతే అందం వుంది. కళ్ళల్లో ఏదో మెరుపుంది. నే చేస్తున్న పని తప్పు! నేనేకాదు. వాలా, ఖర్మకాలిపోయిన ఏ ఆడదిచేసినా తప్పే. ఇది రూల్! అంతే! ఎదురుతిరిగితే ఒళ్లు హూనమయిపోయేట్లు చీవాట్లేస్తుంది సంఘం. సంఘం అంటే మాపిన్ని. ఇంకా అలాంటి వాళ్ళూనూ. ఓ రోజున అంతపనీ జరిగింది కూడానూ. తలంటు పోసుకొని మేడమీదకు ఎక్కి వాలిపోతున్న సూర్యుడిముందు జుట్టారబెట్టుకొంటూ నుంచున్నాను. ఎదురుగ్గా ఆకాశంలో ఇంద్రధనస్సు ఏర్పడింది. వాటి రంగులు చిన్నప్పటినుంచి చూస్తున్నా ఆ రోజున అందులో ఏదో విశేషం కనిపించింది నాకు. నాజీవితానికీ, ఆ ఇంద్రధనస్సుకీ ఏమయినా పోలికలున్నయ్యా అని చిత్రమయిన అనుమానం వచ్చింది. పిచ్చిదానిలా ఆ రంగులవంకే చూస్తూ నుంచుండి పోయాను. ఎప్పుడు వచ్చిందో మా పిన్ని వెనుకనుంచి వచ్చి నన్ను చూసి ఉగ్రురాలయి. పోయింది.

"హవ్వ! సిగ్గనేది ఏకోశాన్నయినా ఉందా? ఆ ఎదురింటి కుర్రాడలా నిన్ను కళ్ళప్పగించి చూస్తుంటే, అక్కడినుంచి తప్పుకోవల్సింది పోయి మళ్ళీ చూస్తూ నుంచున్నావా? ఎవరయినా చూస్తే ఇంకేమయినా ఉందా. మా పరువూ, మర్యాదా ఏమయినా మిగిలేవా? తల్లీ! రాక్షసీ! మా కొంప ముంచకమ్మా! నీకు దణ్ణం పెడతాను! లోపలికిపద: లేనిపోని తద్దినం తెచ్చి నెత్తిన పెట్టుకొన్నందుకు ఇంత శిక్షవేయకు! చెంప లేసుకొంటున్నాగా! నాకు పిల్లలున్నారమ్మా! వాళ్ళకి పెళ్ళిళ్లు కావాలి పదవే!" అంటూ లోపలికి రెక్క పుచ్చుకొని ఈడ్చుకు పోయింది. అప్పుడు గాని నేనీ లోకంలోకి వచ్చి పడలేదు. ఎదురుగ్గా ఇంద్రధనస్సు క్రింద డాబాలోని కిటికీలోనుంచి ఆస్టూడెంట్ నా వంకే చూస్తూండటం కనబడింది. ఆ కుర్రాడిని అంతవరకూ నేను గమనించనే లేదు. తివిరి ఇసుమున తైలంబు తీయవచ్చు గాని, ఆ విషయం మా పిన్నికి చెప్పి నమ్మించటం సాధ్యంకాని పని అంచేత బుద్ధిమంతురాలిలా నోర్మూసుకొని లోపలికి వెళ్లిపోయాను. మర్నాడు మా పిన్ని హుకూం జారీచేసింది. నేను మేడ ఎక్కకూడదు. అధవా ఎక్కాల్సి వస్తే వెంటదెవరయినా తోడుండాలి. అంటే ఆల్మోస్టాల్ నేనో ప్రిజనర్ నయిపోయాను. మా ఇంట్లో అప్పుడే నాకు ఖైదంటే ఎంత ఘోరంగా వుంటుందో తెలిసింది. నేను

చిన్నప్పటినుంచి ఇలాంటి ఖైదు జీవితానికి అలవాటు పడిందాన్ని కాదు. మా నాన్నా, అమ్మా నాకు విపరీతమయిన స్వేచ్ఛ ఇచ్చారు. పెద్దదాన్నయినా కూడా ఆ స్వేచ్ఛను నే దుర్వినియోగ పరచలేదు. చదువూ, స్నేహితురాండ్రూ, సినిమాలే గాని నా దృష్టి ఎప్పుడూ ప్రేమమీదకీ, మొగపురుగులమీదకీ పోలేదు. యస్సెల్సీ చదువుతోండగా కొంతమంది మా క్లాసు అబ్బాయిలు వంతుల వారిగా రోజూ మా యింటివరకూ బాడీగార్డులుగా పస్జేసేవాళ్లు. వాళ్ళలా వెంబడిస్తోంటే నాకు వాళ్ళమీద అసహ్యం కలిగిందేగాని ప్రేమ కలుగలేదు. వాళ్ళవంక కనీసం చూడ బుద్ధేనా వేశేదికాదు. అసలు నా ఆశయం వేరే వుంది. నా స్నేహితురాలు మైథిలి వాళ్ళక్కయ్య శైలజను ఓసారిచూశాను. ఆవిడ శెలవులకు మా ఊరువచ్చి ఆరోజు మమ్మల్నిద్దరినీ పార్కుకి షికారు తీసుకెళ్ళింది. అక్కడ ఓ రెండుగంటలు కూర్చోబెట్టి బోలెడు విషయాలు. మా బుర్రల్లో కెక్కించింది. పెళ్ళయితే ఆడదానికి స్వేచ్ఛ పోతుందట. మగాడు ఆమెని ఓ తలగడలా ఉపయోగిస్తాడేగాని ప్రాణం ఉన్న మనిషిలా చూడ్డట. అందుకనే తను ఎమ్.ఏ. వరకూ చదివి లెక్చరరుద్యోగం సంపాదించుకొందిట. ఇప్పుడు తను చాలా హాయిగా సంతోషంగా వుందిట. ఆమె మాటలు విన్న తర్వాత మే మిద్దరం తులసిచెట్టుదగ్గర ప్రమాణాలు చేశాం. ఎప్పటికయినా మేమూ ఉద్యోగాలు చేసి పెళ్ళిచేసుకోకుండాదర్జాగా గడపాలని. ప్రమాణాలుచేసిన కొద్దిరోజుల్లోనే నాఖర్మ చాలా ఘోరంగా కాలిపోయింది. అంతవరకు దేదీప్యమానంగా వెలుగుతోన్న నా అదృష్టరేఖ ఓ రోజు తెల్లారేసరి కల్లా ఆరిపోయింది. నాన్న ఆ రోజు ఉదయం లేవలేదు. లేవడానికి వెళ్ళిన అమ్మ బిగ్గరగా కేకలువేసి స్పృహ తప్పిపోయింది.

"ఇక మీకు నాన్నలేరు!" అన్నారు చుట్టుప్రక్కలవాళ్లు.

బాబాయి వచ్చాడు. అమ్మనీ, నన్నూ తనింటికి తీసుకువచ్చాడు. మమ్మల్నిద్దరినీ, అలా ఇంటికి తీసుకొచ్చి మేపటం మా పిన్నికి ససేమిరా నచ్చలేదు. (తప్పు పీదికాదు పిన్నీ! మగాడి తోడులేందే ఆడది జీవింతలేదన్న వాదాన్ని సృష్టించి విజం చేసిన ఈ వ్యవస్థది) పైగా పెళ్ళీడు కొచ్చిన నన్ను, అనాధ్యతమా నెత్తినేసుకోవటం బాబాయిచేసిన అవివేక మయిన పని. అందుకని వారంరోజులు మాపిన్నీ, బాబాయి కొట్లాడుకొని మాట్లాడుకో లేదు. ఆ వారం రోజులూ, నేనూ, మా అమ్మా ఆకుటుంబంలోని శాంతిని హత్యచేసిన ఖూనీ కోరుల్లాగా గజగజ వణుకుతూ గడిపాం. ఆ తరువాత మా ఇద్దరి పీడా (మా పిన్ని భాషలో) తనకు తప్పదని తెలుసుకొని మా పిన్ని తను కొంచెం తగ్గి ఊరుకొంది. ఊరుకొన్న కొద్దిరోజు

ల్లోనే మా రిజల్ట్సు వచ్చినయి. నేను యస్సెల్సీ పాసయ్యాను. కాలేజిలో చేరతానని బాబాయితో పిన్ని వినకుండా చెప్పాను. బాబాయి పిన్నికి వినేట్లు చెప్పాడు.


“కాలేజా, గాడిదగుడ్డా! వాళ్ళ పెంకుటిల్లు అమ్మిపారేసి, ఆ వచ్చిన డబ్బుతో పెళ్లి చేసిపారెయ్యకా!” అంటూ తేల్చిపారేసింది పిన్ని.

నేను అమ్మదగ్గర ఏడ్చాను. అమ్మ నన్ను కౌగలించుకొని తనూ ఏడ్చింది. అసలీ అమ్మలకు ఏడవటం తప్ప మరేం చేతవును?

నాన్న త్రాగి వచ్చి చావకొడితే అమ్మ ఏడ్వాలి. నాన్న గుండెనొప్పితో బాధ పడితే అమ్మ ఏడవాలి. కొడుకు పెద్దాడయి ఉద్యోగానికి పరాయిదేశం పోతే అమ్మ ఏడవాలి. కూతురు అత్తారింటికి పోతూంటే అమ్మ ఎడవాలి. కొడుక్కి పెళ్లవుతుంటే ఆనందం పట్టలేక అమ్మ ఏడవాలి. ఆ కొడుకు, పెళ్లాం కాపరానికొచ్చిన రెండో రోజున తల్లిని కొట్టటానికొస్తే, అమ్మే ఏడ్వాలి. అబ్బో! ఒక టేమిటి. తల్లి పాత్ర అంతా ఏడుపే! అందుకనే ప్రపంచంలో ఈ పాత్ర చాలా కష్టమయింది. అయినా ప్రతి ఆడకూతురూ తెలిసో, తెలీకో ఈ వేషమే వెయ్యాలని ఉబలాట పడుతూంటుంది.

మా ఊరు మా రాష్ట్రపు రాజధాని కాదు. కనీసం దానగ్గర కూడా లేదు. అంచేత మా పెంకుటిల్లు, కారు చవగ్గా అమ్మచూసినా కొనేనాథుడు లేకపోయాడు. ఇది మా ఊరి ఖర్మ..

నేను ఏడ్చిన నెల్రోజులకి నన్ను చూడ్డానికో మృగం వచ్చింది. దాన్ని మా బాబాయి, పిన్ని తెప్పించారు. ఏ 'జూ' నుంచి తెప్పించారో తెలీలేదు మరి. మృగం సోఫాలో కూర్చుంది. ఎదురుగ్గా క్రింద చాపమీద నన్ను అలంకరించి కూర్చుండబెట్టారు. మృగం నన్ను చూసింది. చూసి ఇకిలించింది. ఇది మా బాబాయి, పిన్ని చూసి వాళ్లూ ఇకిలించారు. మృగం బాబాయితో ఏదో మాట్లాడి వెళ్ళిపోయింది. అతగాడి మొదటి పెళ్ళాం చచ్చి రెండేళ్ళయిపోయిందిట. రెండేళ్లూ బావుండదని ఊరుకొని టింగురంగామంటూ నన్జూడ్డానికొచ్చాడిప్పుడు. (అతగాడికి పెళ్ళాం చచ్చిపోయింది గదా! అలాగే ఎక్కడయినా మొగుడు చచ్చిపోయిన అమ్మాయుంటే చేసుకోకూడదూ! ఊహు! అల్లాక్కాదు. పదహారేళ్ళ కన్నెపిల్ల కావాల్సార్!) కట్నం అవసరం లేదుట. పెళ్లి ఖర్చులు పెట్టుకుంటే చాలుట. బాబాయి ఎగిరి గంతేశాడు. పిన్ని లావు మూలాన ఎగరకుండానే గంతేసినంత పన్జేసింది. నా పెళ్ళి నిశ్చయమయిపోయింది. నలభై ఏళ్ళు దగ్గరగా ఉన్న రెండో పెళ్ళాడితో పదిహేడేళ్ళు నిండని నాకు పెళ్ళి. అయినా ఇది వింత కాదు. అసాధారణ సంఘటన కాదు. తన్నినా.




ఇంట్లోంచి బయటకు వెళ్లగొట్టినా, గొంతు పిసికినా పరే భారతస్త్రీకి పతియే ప్రత్యక్ష దైవం'' లాంటి టూల్సు. రెగ్యులేషన్లు కోకొల్లలుగా ఉన్న ఈ దేశంలో, అందునా ఆ సూత్రంమీదే కథాంశం గల సిన్మాలు (స్త్రీలకు ప్రత్యేకం) శతదినోత్సవాలు జరుపుకొంటూన్న ఈ ఆంధ్ర దేశంలో అలాంటి విషయాలు లెఖ్ఖచేసే మహాపురుషుడూ లేడు. మహాతల్లులూ లేరు. అంచేత నా ఖర్మ మరోసారి కాలిపోయింది. అతనితో నాకు పెళ్ళయింది. పెళ్ళికి మా బంధువులు బోలెడుమంది వచ్చారు. ఆడాళ్లు జరీచీరలు, సిల్కు చీరలు, టెరిలిన్ చీరలు గంటకొకటి మారుస్తూ తోటి ఆడది ఘోరంగా బలి అయిపోతున్న ఆ దురదృష్ట క్షణాల్ని పండుగలా జరుపుకొన్నారు. (ప్రియమయిన స్త్రీలారా! నాకు పట్టిన గతి మీకందరికీ పడితే ఎలా ఉండేదో ఒక్కసారి ఊహించుకోండి. పైగా నా కిష్టం లేకుండా ఆ మృగం నా మెళ్లో తాళి కడుతూంటే శుభప్రదమయిన అక్షింతలు నవ్వుకొంటూ మా నెత్తిన చల్లుతారా? మీకు సిగ్గుందీ? మొగిలి పువ్వంటి మొగుణ్ణివ్వాలే అని నేనూ పాటలు పాడాను, నాలానే యవ్వనంలో అడుగెడుతూన్న సోగ్గాడు నన్ను కట్టుకొంటే, ఆ మధుర క్షణాలు అనుభవించాలని నేనూ ఉవ్విళ్లూరాను. ఇద్దరం రేపు, నిన్నలను మర్చిపోయి ఎప్పటికప్పుడు ''ఈ రోజే'' అనే ఆనందంలో మునిగిపోవాలని కలలు కన్నాను. ఇప్పుడు ఆ రాస్కెల్ నాకు తనూ, తన మొదటి

పెళ్ళాంతో గడిపిన హనీమూన్ గురించి చెప్తాడు. వాళ్ళిద్దరూ కలసి వెళ్ళిన పిని మాలు గుర్తు చేసుకొంటాడు. ఆ పెళ్లాం కనిపిస్తే పిల్లల్ని చూపించి "నువ్వే వీళ్ళకి తల్లివ"ంటాడు. వేగంగా స్రవహించే నా యవ్వనానికి ఇలాంటివన్నిటినీ కలిపి ఓ ఆనకట్ట కట్టేస్తాడు. పెళ్ళయిన కుర్రాణ్ణనుంచే నన్నో అమ్మమ్మలా చేసేస్తాడు. అంచేత ఈ కన్నెపిల్ల ఉసురూ మీకూ, నన్ను జాలి లేకుండా పెళ్ళాడేస్తూన్న అతనికీ తప్పక తగుల్తుంది. కన్నెపిల్ల ఉసురు సామాన్యమయింది కాదు. తప్పక దెబ్బతీస్తుంది). ఆ రాత్రి అతను నన్ను కౌగలించుకొన్నాడు. నేను వీదరించుకొన్నాను. వారంరోజు లవకుండానే అతను మార్కెట్నుంచి సైకిల్ మీద వస్తోంటే లారీ వచ్చి గుద్దింది రెండురోజులు హాస్పిటల్లో బ్రతకటానికి ప్రయత్నించి అతను చనిపోయాడు. అతను చనిపోయినప్పుడు నాకు ఏడుపు రాలేదు. అసలు ఏడవాలనే అనిపించలేదు. ఎక్కడో దూరపుబంధువు మనమెప్పుడూ చూడనివాడు పోతే ఎలా ఫీలవుతామో అలాగే ఫీలయ్యాను. మా పిన్ని నన్ను చూసి శాపనార్థాలు పెట్టింది.

"రాక్షసీ! ఏడవ్వే! ఎవరయినా చూస్తారనయినా సిగ్గు లేదేం? అయ్యో అప్రతిష్ఠ! మొగుడు చచ్చాడన్న విచారం లేకపోతే మానే. ఎవరయినా చూడ్డానికొచ్చినప్పుడు కళ్ళవెంబడి నీళ్ళయినా పెట్టుకు అఘోరించు...."

నాకు నవ్వువస్తోంది కాని, ఏడుపు రావటం లేదు. నేనేం చేయను? పదిహేడేళ్ళు నిండకముందే, పెళ్లాట్టం, మొగుడు ఛస్తం, "అన్ఫిట్ టు లివ్ నార్మల్ హ్యూమన్ లైఫ్" అనే సర్టిఫికెట్ తీసుకోడంకూడ జరిగిపోయాక, ఇంక ముందున్న జీవితం ఓ ప్రక్కా, ఈ సంఘాన్ని మరో ప్రక్కా చూస్తే నవ్వు రాదూ? తప్పకుండా వస్తుంది. అసలు పగలబడి నవ్వాల్సిన "అకేషన్" అది. కాని బావుండదని ఊరుకొన్నాను. లేక మా పిన్ని తిట్లకు భయపడి ఊరుకొన్నానన్నా సరే! నన్ను చూట్టానికప్పుడు (అప్పుడు నన్ను ఓసారి చూడాల్సింది. ఫాన్సీ డ్రస్ వేసినట్లు తెల్లని చీర, గాజుల, బొట్టూ లేకుండా—హాయ్! ఒకచేమిటి, 'జూ' లో కేజ్లో పక్షిని పెట్టినట్లు పెట్టారు నన్ను ఎగ్జిబిషన్కి) అందరూ రావడం, నేను ఏడవకపోటం చూసి చెవులు కొరుక్కోవటం, వెళ్ళిపోవటం— ఒకరిద్దరు దేవతాస్వరూపిణులు నా మొఖం మీదే దీవించబోయారుకూడా. "నోర్మూసుకొని మీ పన్జూసుకోండి!" అంటూ తీక్ష రేగి జవాబిచ్చాను, వాళ్ళు వెనక్కి తిరిగి కూడా చూడకుండా బయటకు పరిగెత్తారు.

ఇజ్జరిగి రెండేళ్ళయిం తర్వాత మా పిన్ని పెద్దకూతురు 'అరుంధతి' పెళ్ళయింది. వరుడు సురేందర్ ఎమ్మెస్సీ. లెక్చరర్. దానికి పద్దెనిమిదేళ్ళు. అతనికి ఇరవై

మూడేళ్ళు. కట్నం ఎనిమిది వేలు. చిలకా గోరింకల్లా ఇద్దరకూ జోడీ సరిపోయిందని అందరూ అనుకొన్నారు.

(చెల్లాయ్! నాకు దక్కని అదృష్టం నీకయినా దక్కింది. అయినా నాకు నీమీద ఈర్ష్య లేదమ్మా! కలకాలం చల్లగా ఉండండి).

ఇప్పుడు మా పిన్ని రెండో కూతురు శకుంతల పెళ్ళవుతోంది. నా వయసు ఇప్పుడు ఇరవైనాలుగేళ్లు. నా వయసమ్మాయిలందరూ మొగుళ్ళతో పందిళ్ళంతా దీపాల్లా తిరుగుతున్నారు. పిల్లల నెత్తుకెళ్ళి భర్తల కందిస్తున్నారు. మళ్ళీ తెచ్చుకొంటున్నారు. ఎవ్వరూ చూడకుండా భర్తలను వెక్కిరిస్తున్నారు. ఎవ్వరికీ విన బడకుండా వేళాకోళ మాడుతున్నారు. దొంగతనంగా వాళ్లను గిల్లుతున్నారు. ఇదంతా, ఇవన్నీ నేనేం పాపం చేసుకొన్నానో, నా కంట బడుతున్నయి. అప్పుడే నా యవ్వనం మేల్కొని నన్ను ఇబ్బంది పెడుతూండేది. ఇదే కాదు. అరుంధతి పెళ్లయిన క్రొత్తలో నా పని మరీ ఘోరంగా ఉండేది. అరుంధతి భర్త సురేందర్ నాతో మాట్లాడ్డానికి ప్రయత్నించాడు. అతని ప్రయత్నాలు అన్ని విధాలా వమ్ముచేయడానికి ప్రయత్నించేది అరుంధతి. అసలు నన్ను అతని ఛాయలకు కూడా రాకుండా జాగ్రత్త పడుతూండేది. అతనికి నామీద సానుభూతి తప్పితే మరేమీ లేదు. నాకది తెలుసు. అతనిది యువక రక్తం, నాకు జరిగిన అన్యాయం అరుంధతిద్వారా తెలుసుకొన్నాడతను. అప్పటినుంచీ నాతో సానుభూతిగా రెండుమాటలు మాట్లాడాలనీ, నాకు ధైర్యం చెప్పాలనీ అతని అభిలాష. అరుంధతికేమో అతను ఓసారి నాతో మాట్లాడితే తనను మర్చిపోతాడేమోనని అనుమానం.

(పిచ్చి అరుంధతీ! అంతకింత పరచకు తల్లీ! నీతోటి ఆడదాన్ని ఇప్పటికే మనగతి అధ్వాన్నంగా ఉంది. మేల్కొని సాటి ఆడదాన్ని నమ్మటం, గౌరవించటం నేర్చుకోమ్మా! లేకపోతే మనఖర్మ ఎప్పుడూ ఇలాగే తగలడుతుంది.)
వేళ్ళలోగా అతను ఎలాగోలా అవకాశం కలిగించుకొని నాతో మాట్లాడాడు.

"మీరు ఎవ్వరిమాటలూ వినవద్దు. అందరూ గట్టున ఉండి కబుర్లు చెప్పే వాళ్ళు కాలేజిలో చేరండి! లేపోతే నర్సుగానో, టీచర్‌గానో ట్రయినింగ్ తీసుకోండి. ముందు ఎలాగోలా మీకాళ్ళ మీద మీరు నిలబడే సత్తువ తెచ్చుకోండి. తరువాత మీ మన సుకేది వచ్చితే అది చేయండి. మీ భవిష్యత్తు మీచేతుల్లో ఉంది. మిమ్మల్ని నా చెల్లాయ్‌గా భావించి సలహా ఇస్తున్నాను. ఈ విషయంలో మీకే సహాయం కావాలన్నా చేయడానికి సంసిద్ధంగా ఉన్నాను."

అతనిమాటలు నాకు ఓ క్రొత్త ఉత్సాహాన్ని కలుగ జేసినయి. ఏంచేయ

దానికి తోచక సతమత మవుతోన్న నాకు అతనిచ్చిన సందేశం ఓ మార్గాన్ని చూపింది. కాని అవేమీ ఫలించలేదు.

"అలాంటి పిచ్చి వేషాలేమీ వెయ్యొద్దని" పిన్నిగట్టిగా వార్నింగిచ్చింది.

రెండు రోజులు ఏడుస్తూ కూర్చున్నాను. అమ్మకు నాదే బెంగ. మంచం పట్టింది. మనోవ్యాధికి మందులేదని నాకు తెలుసు. అమ్మకి మనోవ్యాధో కాదో చూట్టాని కసలు డాక్టరు కూడా రాలేదు. నీకు నా పరిస్థితి చూపి ఉక్రోషం ముంచుకొచ్చింది.

సురేందర్‌కి ఉత్తరం వ్రాద్దామని కూర్చున్నానుగానీ, అది మళ్ళీ ఏమేం గొడవలకు దారితీస్తుందోనని ఊరుకొన్నాను. ఈలోగ ఇప్పుడు శకుంతల వెళ్ళి చివరకుర్చీలో కూర్చుని నా వంకే చూస్తూ అతను—వధూవరులకు కట్నాలు చదివిస్తున్నారు. అతను నావంక చూసి చిన్నగా నవ్వాడు. నే నెందుకు నవ్వకూడదో నాకు తెలీలేదు. మొగాణ్ణి చూసి నప్పుడు జీవితంలో మొదటి సారిగా అప్పుడు నాకు సిగ్గువేసింది. తల ప్రక్కకు తిప్పి చూపులు మరల్చుకొన్నాను. కాని ఎంతోసేపు అవకుండానే తిరిగి అతనివంక చూశాను. అతను పంజాబీడ్రస్ వేసుకొన్న ఓ అమ్మాయితో ఏదో మాట్లాడుతున్నాడు ఆ అమ్మాయి నవ్వుతోంది. ఇరుగ్గా బట్టలేసుకొనే అమ్మాయిల మీద నాకు సదభిప్రాయం బొత్తిగాలేదు. పైగా అతని లాంటి మొగాడు ఆ అమ్మాయితో అలా నవ్వుతూ మాట్లాడటం అసలు నచ్చలేదు. ఆ అమ్మాయి అక్కడి నుంచి కదిలి అందరినీ తప్పించుకొని నా దగ్గరకు వచ్చింది. నే నతనివంకే చూస్తోనుంచున్న సంగతి పసిగట్టిందేమోనని భయంవేసింది నాకు.

"నాపేరు అవంతి. పెళ్ళి కొడుకు మాఫామిలీ ఫ్రెండ్. మరి మీ పేరు?" అడిగిందామ్మాయి.

ఆపిల్ల చొరవ నాకర్థం కాలేదు.

"జ్యోతి" అంటూ జవాబిచ్చాను.

"వెరీగుడ్! ఎ నేమ్ టు రిమెంబర్! మీరుపెళ్ళి కూతురికే మవుతారు"

"శకుంతల నా కజిన్" అన్నాను.

"ఐసీ!" అందామె.

నాకు మీ బాబ్డ్ హెయిర్ పూర్తిగా నచ్చలే దందామని నోటిదాకా వచ్చింది కాని తమాయించుకొని ఊరుకొన్నాను.

ఆ తరువాత ఇద్దరం చాలాసేపు పెళ్ళిళ్ల గురించి, పెళ్ళిళ్ళల్లో ఆచారాల గురించీ మాట్లాడుకొన్నాం. భోజనం కూడా ఇద్దరం కలిసేచేశాం, ఆరాత్రి వెన్నెల పాలలా ప్రవహిస్తోంది. నేనూ అవంతి చాలాసేపు ఇంటి ముందు ఇసుకలో కూర్చుని కబుర్లు చెప్పుకొన్నాం. అవంతి తన గురించి నాకు చెప్పింది. నాకథ తెలుసుకొని జాలిపడింది. మాపిన్ని సంగతి విని మండిపడింది.



"లచ్చి, ఆ పింగాణీ ప్లేట్లు జాగ్రత్త సుమా, చెయ్యి జారి పడేను..."
"ఏం పర్లేదమ్మా. పడితే మాత్రం అవేటి సేస్తాయి నా కాళ్ళకి!"

"ఇంతకూ నేను మీతో ఎందుకు పరిచయం చేసుకొన్నానో తెలుసా?' అనడిగింది.

'ఎందుకూ?' అనడిగాను ఆశ్చర్యంగా

"మా అన్నయ్య కోరికపై!" అంది.

"అదేమిటి?" అన్నాను ఏం మాట్లాడాలో తెలీక.

"ఊహు ఏమీతెలీనట్లు...."అందామె నవ్వుతూ.

"నిజం జ్యోతీ! అన్నయ్యకి మీరు నచ్చారు! మిమ్మల్ని చేసుకోవాలని అన్నయ్య కోరిక. మీగురించి వివరాలు కనుక్కుందామని వచ్చాను...."

"కాని....కాని...."మాటలు దొరకలేదు నాకు. తడబడ్డాను.

"మీరు విడో అనేగదా మీ అనుమానం! ఈకాలంలో కూడా ఇంకా ఈ ఆచారాలూ వల్లకాడూ ఏమిటి? ఆ మూఢ నమ్మకాలు పట్టుకుని మీ జీవితం ఎందుకు నాశనం చేసుకొంటారు?"

"నేననేది నాగురించి కాదు ..మీ తల్లి....దండ్రులు...."

"హోస్! మా నాన్నగురించి మీకు తెలీదు. పదేళ్ళ ఇంగ్లండ్‌లో ఉండి వచ్చారు. అంచేత వచ్చేప్పుడు వాళ్ళ ఆచారాలూ, సంస్కృతి కూడా తీసుకొచ్చారు. మా ఇంటి నిండా అదే వుంది, అంచేత మీ కాభయం అక్కర్లేదు?"

నేనే మీ మాట్లాడలేదు. అతనింత ధైర్యం చేయగలడని నేననుకో లేదు.

పైగా ఈ ఇరుకు బట్టలేసుకొన్న పిల్ల గాడంటె ఇంత విశాలం అని కూడా నేను ఊహించలేదు.

(భగవంతుడా నువ్వున్నావ్। ఎందు కంటే నామీద జాలిపడే ఓ స్త్రీ ఉంది. ఆ పిల్ల నాకు విముక్తి కలిగించటానికి శ్రమపడుతోంది. ఆడపిల్ల లందరకూ ఇరుకు బట్ట లివ్వమని నేను వేడుకోను గానీ, కనీసం ఆ విశాల హృదయం ఇవ్వ కూడదూ? నీకు ఆజన్మాంతం ఋణపడి వుంటాను.)

తరువాత కధ అంత ముఖ్యమయింది కాదు. అవంతి అన్నయ్యా శకుంతల భర్త రికమండేషన్‌తో మా యింటికి వచ్చి నన్నుపెళ్లాడే విషయం బాబాయిని అడిగించటం, పిన్ని ఏమయినా సరే వల్ల కాదనీ, తనమాట కాదంటే వల్లకాదేమో ననీ గొడవ చేయడం—ఎవ్వరూ ఏమి చెయ్యలేని పరిస్థితిలో అవంతీ, నేనూ, అమ్మా టాక్సీలో అతవిల్లు చేరుకోవటం, అక్కడ మాపెళ్ళి చాలా సింపుల్‌గా అందంగా జరగటం—ఇంతే। ఇదే జరిగింది. కానీ ఓ విశేషం మాపెళ్ళికి పిలచిన బంధువు లెవ్వరూ రాలేదు. అందరూ ఓ యింట్లో గుమికూడి నాగురించి తిట్లూ శాపనార్థాలతో చెప్పు కొన్నారట. మా పిన్ని "మాజ్యోతి చచ్చి పోయింది. పీడా విరగడయి పోయిందని అందరితోనూ అన్నదట." ఇక్కడ నాకర్థం కాని దొక్కటే. ఈ రెండో పెళ్ళివాడు ఓ పసిపిల్లని చేసు కొంటూంటే తగుదునమ్మా అని వచ్చి దీవించిన పెద్దలందరూ ఓ రెండో పెళ్ళి అమ్మాయి ఓ అబ్బాయిని చేసుకొంటూంటే ఎందుకు దీవించటానికి రాలేదు. మన సంఘం ఎందుకింత కుళ్ళి పోయింది? మగాడు ఎన్నిపెళ్ళిళ్ళయినా మహారాజులా చేసుకొంటాడా। అదే ఆడదయితే ముఖాన్న ఉమ్మి వేస్తారా? ...అయినా సరే। నేను "కేర్" చెయ్యను. నాకు ఎవ్వరితోనూ పనిలేదు. ఈ జీవితం నాది. అనుభవించేది నేను. నన్ను శాసించే అధికారం ఎవ్వరికీ లేదు. నాక్కావల సింది ఈ కుళ్ళు సంఘం తాలూకు దీవెనకాదు. నా భవిష్యత్తు నాకు ముఖ్యం.

